# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 31, జులై 2026




# విద్యార్థులకు నవోదయం..

- ఆరు నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్య
- జవహర్ నవోదయ విద్యాలయాల్లో మెరుగైన వసతులు
- నేటితో ముగియనున్న ప్రవేశాల దరఖాస్తు గడువు
- నవంబర్ 28న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027-28 విద్యా సంవత్సరానికి గానూ ఆరో తరగతిలో ప్రవేశాలకు గానూ నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశ పరీక్షకు ఐదో తరగతి పూర్తి చేసిన వారు అలాగే ఈ సంవత్సరం ఐదో తరగతి చదువుతున్న వారు అర్హులు. ఈ ఏడాది నవంబర్ 28న ప్రవేశపరీక్ష నిర్వహించి వచ్చే సంవత్సరం మార్చి లేదా ఏప్రిల్లో ఫలితాలు విడుదల చేస్తారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో సీటు సాధించిన విద్యార్థులు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా ఉచితంగా చదువుకోవచ్చు. చదువుతో పాటు ఆటలు, సమగ్ర వికాసానికి కూడా ప్రాధాన్యత ఇస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులకు కాగజ్‌నగర్ పట్టణంలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఈ పాఠశాలలో గరిష్టంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. అభ్యర్థులు ప్రవేశం పొందే జిల్లాలో ప్రస్తుతం చదువుతూ ఉండాలి. 01.05.2015 నుండి 31.07.2017 మధ్య జన్మించి ఉండాలి. పరీక్షను విద్యార్థులు ఒక సారి మాత్రమే రాయడానికి అవకాశం ఉంటుంది. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించగా మిగితా 25శాతం సీట్ల మిగతా 2లో..

# ప్రజలు వాగులు దాటే సాహసం చేయకూడదు: కలెక్టర్

ఆసిఫాబాద్, జులై 30, ప్రభాతవార్త :

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఎవరూ వాగులు దాటే సాహసం చేయకూడదని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. గురువారం కలెక్టర్ ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు, జిల్లా లోని ఇతర వాగుల వరద ప్రవాహాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు, మిగతా 2లో..



# ఆదిలాబాద్ నిర్మల్ ఆర్మూర్ రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వండి

## కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన తెలంగాణ బీజేపీ నేతలు

నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ నిర్మల్ ఆర్మూర్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు వెంటనే అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని తెలంగాణ బీజేపీ నేతలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలోని రైల్వే శాఖ మంత్రి కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం గురువారం మిగతా 2లో..




# భారీ వర్షాలతో.. ఉగ్రరూపం దాల్చిన ప్రాణహిత



- * ఉప్పొంగుతున్న నీల్వాయి ప్రాజెక్టు
- * వాగుల ఉధృతితో స్తంభించిన రాకపోకలు
- * నీట మునిగిన పంటలు..
- * పలుచోట్ల కూలిన ఇళ్ల గోడలు

- వేమనపల్లి, జూలై 30, ప్రభాతవార్త





2లో..

# విద్యార్థులకు నవోదయం..

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఎవరైనా పోటీ పడవచ్చు. అయితే గ్రామీణ ప్రాంత కోటాలో సీటు కోసం పోటీ పడే విద్యార్థులు 3,4,5వ తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠ శాలలో లేదా ఏదైనా గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో చదివి ఉండాలి. అలాగే ఇందులో ఉన్న మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు. అలాగే 7.5 శాతం ఎస్టీలకు, 15 శాతం ఎస్సీలకు, 27 శాతం ఓబీసీలకు, దివ్యాంగులకుకొన్ని సీట్లు కేటాయిస్తారు.

**పరీక్ష విధానం :** నవోదయ పరీక్ష మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 ప్రశ్నలు ఉండగా 2 గంటల కాల వ్యవధి ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ నుంచి 40 ప్రశ్నలు, అర్థమెటిక్ నుంచి 20 ప్రశ్నలు, లాంగ్వేజ్ టెస్ట్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఇలా కోరుకున్న మాధ్య మంలో పరీక్ష రాసే వెసులుబాటు కలదు.

### ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ..

దరఖాస్తు పూర్తిగా ఆన్లైన్లోనే చేయాలి. ఎలాంటిదరఖాస్తు రుసుం లేదు. విద్యార్థి ఫొటో, సంతకం, ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, చదువు తున్న పాఠశాల ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, దివ్యాంగుల ధృవీకరణ పత్రం (విద్యార్థి దివ్యాంగుడు అయితే), అపార్, పెన్ ఐడీ వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి.

### ప్రతిభ ఆధారంగా ఎంపిక : రేపాల కృష్ణ, నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్



నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రవేశ పరీక్షలో 100 మార్కులకు గాను 80 అబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యకు బలమైన పునాది వేసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అర్హులైనా ప్రతి విద్యార్థికి ఈ సమాచారం చేరే విధంగా చేసి దరఖాస్తు ప్రక్రియలో సహకారం అందించాలి. ప్రతిభ ఆధారంగా విద్యార్థులు ఎంపికవుతారు.

# భారీ వర్షాలతో.. ఉగ్రరూపం దాల్చిన ప్రాణహిత

వేమనపల్లి, జూలై 30, ప్రభాతవార్త

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు మండలంలో ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో వేమనపల్లి మండలంలో వరద పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. ప్రాణహిత నది ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుండగా, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరి పంట పొలాలను ముంచెత్తుతోంది. ప్రాణహిత వరద ఉధృతికి వేమనపల్లి రేవు వద్ద నిలిపిన పడవలు కొట్టుకుపోయి దిగువన ఉన్న వెంచపల్లి రేవు వద్ద దొరికాయి. దీంతో నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నీల్వాయి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి మత్తడిపై నుంచి ఉధృతంగా వరద నీరు పారుతోంది. భారీ ప్రవాహాల కారణంగా చామనపల్లి వాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బద్దెల్లి ఒర్రె, కొత్తపల్లి వాగులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. మండలంలోని లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేనులు, వరి నారు మడులు వరద నీటిలో మునిగిపోయాయి. ముఖ్యంగా ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల ధాటికి సుంపుటం గ్రామానికి చెందిన కూకట్ల గట్టయ్య, కొండగొర్ల ధర్మయ్య ఇళ్ల గోడలు కూలిపోయాయి. బమ్మెన గ్రామంలో పెద్దల శంకర్ ఇంటి గోడ, క్యాతనపల్లి గ్రామంలో చౌదరి బాపు ఇంటి గోడ కూడా నేలకూలాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

### ప్రజల భద్రత కోసం రాకపోకలు

### తాత్కాలికంగా నిలిపివేత

నీల్వాయి-మామడ గ్రామాల మధ్య ఉన్న వాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని నీల్వాయి గ్రామ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని ఏర్పాటు చేసి ఆ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరద పరిస్థితులను ఎంపీడీఓ కుమారస్వామి, తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీఓ వెంకటేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఖలీక్, జీపీవో రంజిత్, హెడ్ కానిస్టేబుల్ అబినైజర్, గ్రామ కార్యదర్శి పున్నం తదితరులు ప్రత్యక్షంగా పరిశీలించారు. వాగులు, వంకలు, వరద ప్రవాహాలను దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను హెచ్చరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ఈ కేవైసీ గడువును పొడిగించాలి

### - తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం

ఆసిఫాబాద్, జులై 30, ప్రభాతవార్త :

ఈ నెల 31తో ముగియనున్న ఈకేవైసీ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ రావ్ గురువారం విజ్ఞప్తి చేశారు. జిల్లాలో విద్యార్థులు హాస్టళ్లు, పాఠశాలల్లో ఉండటం, గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక మంది రేషన్ దుకాణాలకు వచ్చి ఈకేవైసీ పూర్తి చేసుకోలేకపోతున్నారని తెలిపారు. అదేవిధంగా ఐదు, ఆరు సంవత్సరాల చిన్నారులకు ఈపాస్ యంత్రంలో వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడంతో ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిరుపేద ప్రజలు, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఈకేవైసీ గడువును మరికొన్ని రోజులు పొడిగించి అందరికీ అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులను ఆయన కోరారు.

## మా కాలనీకి బ్రిడ్జి నిర్మించండి

- వాగుల ప్రవాహంతో దిగ్బంధంలో ముత్యంపేట కాలనీవాసులు
- వైద్యం, నిత్యావసరాల కోసం తీవ్ర అవస్థలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలని విజ్ఞప్తి

బజార్హత్నూర్, జులై 30, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని జవహర్నగర్ (ముత్యంపేట) కాలనీవాసులు వర్షాకాలం వస్తే చాలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలనీకి ఇరువైపులా ఉన్న వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి దిగ్బంధంలో చిక్కుకున్నారు. కాలనీకి అనుసంధానంగా వంతెనలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి, అత్యవసర వైద్య సేవలు పొందడానికి ఆసుపత్రులకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల పరిస్థితి వర్ణనాతీతంగా మారిందని, రాకపోకలు సాగించలేక ఇళ్లకే పరిమితమై బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వాపోయారు. ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహంలో రాకపోకలు సాగించడం ప్రాణసంకటంగా మారిందని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీకి ఇరువైపులా వెంటనే శాశ్వత బ్రిడ్జిలు (వంతెనలు) నిర్మించి, తమ కష్టాల నుంచి గట్టెక్కించాలని ముత్యంపేట కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజలు వాగులు దాటే సాహసం చేయకూడదు

(మొదటిపేజీ తరువాయి)

నదులు నిండుగా ప్రవహిస్తున్నాయని,ప్రజలు, వ్యవసాయదారులు, పశువుల కాపరులు వాగులు దాటే సాహసం చేయవద్దని సూచించారు.ప్రవాహం ఎక్కువగా ఉన్న వాగులు, వంతెనలు, అల్పస్థాయి వంతెనల (కల్వర్టుల) వద్ద రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు సిబ్బందిని కాపలాగా ఉంచడం జరిగిందని, ఎవరినీ దాటడానికి అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు.అంతకుముందు మండలంలోని గుండి వాగు ప్రవాహాన్ని, లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఏదైనా అత్యవసర సహాయం కావలసి వస్తే కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 8500844365 ను సంప్రదించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ నిర్మల్ ఆర్మూర్ రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయనను కలిసింది.ఈ భేటీలో మహేశ్వర్ రెడ్డితో పాటు ఎంపీలు డీకే అరుణ, ఈటెల రాజేందర్, మాధవనేని రఘునందన్ రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాథోడ్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం వల్ల ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని నేతలు మంత్రికి వివరించారు. ఈ లైన్ ద్వారా వ్యాపారులకు, విద్యార్థులకు, రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిపాదనలను పరిశీలించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నిర్మల్‌లో కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్

### - అత్యవసర సహాయం కోసం 9100577132 సంప్రదించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టినట్లు నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. వరదలు, నీట మునిగే ప్రాంతాల ప్రజలకు సత్వర సహాయం అందించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132కు 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సహాయ అభ్యర్థనలను వెంటనే సంబంధిత శాఖలకు చేరవేస్తారని పేర్కొన్నారు. వర్షాల వల్ల రోడ్లు తెగిపోవడం, ఇళ్లలోకి నీరు చేరడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి సమస్యలు ఎదురైతే ఈ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులను అప్రమత్తం చేశామని, సహాయక బృందాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ, లోతట్టు ప్రాంతాల్లోని వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

### - మాదారం సర్పంచ్ మామిడాల లలిత

తాండూర్, జులై 30, ప్రభాతవార్త :

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం మహిళ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధిలో ముందుండి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు ఆయిల్ల రాజ్ కుమార్, రైతు భారతి, కస్తూరి రమేష్, చెప్యాల నిరంజన్ రావు, మాజీ సర్పంచ్ మామిడాల రాజేశం, అంగన్వాడీ టీచర్ సుజాత, వెలుగు సిసి రజిత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**





**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. వర్షాలు, వరదలపై సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు జిల్లాల్లో అతిభారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా వర్షపాతం, డ్యాముల్లో నీటి మట్టాలు, దెబ్బతిన్న రోడ్లు, చేపట్టిన సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. గ్రామీణ స్థాయిలో చాటింపు ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, నదుల పరిసర ప్రాంతాలకు పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ ఇతర విభాగాలతో సమన్వయంతో పనిచేస్తోందని, పూర్తిస్థాయిలో అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, సీపీఓ గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, డీపీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన అధికారి రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో పాఠశాలలకు సెలవు

**- విద్యార్థుల భద్రత దృష్ట్యా నిర్ణయం - కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**భైంసా, జులై 30, ప్రభాతవార్త:** జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, నీటి ప్రవాహాలు అధికంగా ఉన్న ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




## ఆర్జీయూకేటీ-బాసర్‌లో పీయూసీ-I ఓరియంటేషన్

**భైంసా, జులై 30, ప్రభాతవార్త:** బాసర మండల కేంద్రంలోని ఆర్జీయూకేటీలో నిర్వహిస్తున్న పీయూసీ-I ఓరియంటేషన్ కార్యక్రమం నూతన విద్యార్థులకు ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎం.ఎల్. సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, నిరంతర కృషి, నైతిక విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో లభించే వనరులు, పరిశోధనా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు తమ అనుమానాలను ఆయనతో పంచుకుని నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ పాల్గొని ముఖ్య అతిథిని సత్కరించారు. గ్రామీణ ప్రతిభను ప్రపంచ స్థాయి నైపుణ్యాలుగా తీర్చిదిద్దేందుకు ఆర్జీయూకేటీ కట్టుబడి ఉందన్నారు. విశ్వవిద్యాలయ విధానాలు, సౌకర్యాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. గుజ్జరి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, పీయూసీ-I విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**- టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలి: కలెక్టర్ రాజర్షి షా**



**బజార్‌హత్నూర్, జులై 30, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వర్షాలు, వరదలకు సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తారని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తక్షణ చర్యలు చేపడతారని వెల్లడించారు. ప్రజలు అనవసర ప్రయాణాలు చేయవద్దని, వాగులు, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కోరారు.

## శ్రీ గండీరామన్న దత్తసాయి ఆలయ చైర్మన్‌గా కొట్టె శేఖర్ ప్రమాణం

**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:** పట్టణ ప్రజల ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ గండీరామన్న దత్తసాయి ఆలయ నూతన చైర్మన్‌గా కొట్టె శేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. "భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆలయ వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి. సేవాభావమే ఉంటేనే భక్తుల నమ్మకాన్ని నిలబెట్టుకోగలం" అని ఆయన అన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దడంతో పాటు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చివరగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నూతన చైర్మన్‌కు ఆశీర్వచనాలు అందించారు.



## గోదావరిలో చేపల వేటపై నిషేధం

**- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్ అవినాష్**

**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:** జిల్లాలో రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్. అవినాష్ తెలిపారు. గోదావరి నదిలో వరద ఉధృతి పెరిగే సూచనలు ఉన్నందున నది పరివాహక ప్రాంతాల్లో చేపల వేటపై నిషేధం విధిస్తున్నట్లు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో చేపల వేటకు వెళ్లకూడదని, చెరువులు, వాగుల వద్ద సరదాగా ఈతకు వెళ్లవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మత్స్యకారుల లైసెన్సులతో పాటు సొసైటీల రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో చాటింపు ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు, మత్స్యకారులు అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని కోరారు.

## నిర్మల్‌లో ఆగస్టులో సదరం శిబిరాలు

**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగుల కోసం ఆగస్టు నెలలో సదరం వైకల్య ధ్రువీకరణ శిబిరాలను నిర్వహించనున్నారు. నిర్మల్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజూ ఉదయం 9.00 గంటలకు ఈ శిబిరాలు జరుగుతాయి. ఎముకల వైకల్యం, పక్షవాతం ఉన్నవారికి ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో, చూపు లోపం ఉన్నవారికి 6, 13, 20, 27 తేదీల్లో, మానసిక వైకల్యం ఉన్నవారికి 7వ తేదీన, వినికిడి లోపం ఉన్నవారికి 12వ తేదీన శిబిరాలు నిర్వహిస్తారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు మీసేవ స్లాట్ బుకింగ్ రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్, పాత ధ్రువీకరణ పత్రం జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సంబంధిత వైద్య రిపోర్టులు, నమోదు చేసిన మొబైల్ నంబరు తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. నిర్ణీత తేదీల్లోనే శిబిరాలకు హాజరై సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కోరారు.

## భారీ వర్షాలతో గ్రామాల్లో సర్పంచులు, సిబ్బంది అప్రమత్తం

**సారంగాపూర్, జులై 30, ప్రభాతవార్త:** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచులు, గ్రామ సిబ్బంది



అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం నుంచే మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఇళ్లలోకి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా, మురికి గుంటలు ఏర్పడకుండా సిబ్బందితో కలిసి గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

## మండల పరిషత్ సమీక్షా సమావేశం

**సారంగాపూర్, జులై 30, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైతు వేదికలో మొదటి మండల పరిషత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్పంచులందరి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు, సామాజిక తనిఖీ (ఆడిట్) అంశాలపై చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, 16వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. వ్యవసాయం, ప్రజారోగ్యంపై అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏఓ వికార్ అహ్మద్, డాక్టర్ నందకుమార్, ఎంఈఓ మహేందర్, హౌసింగ్ ఏఈ నాగార్జున, ఎలక్ట్రికల్ ఏఈ, ఈఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఏఈ, ఏపీఓ మంజుల, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# అత్యవసరం తప్ప బయటకు వెళ్లొద్దు

**- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి**

**- వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక - ఆపదలో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచన**

**మంచిర్యాల, జూలై 30, ప్రభాతవార్త**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, అవసరమైతే అత్యవసర సహాయం కోసం నూరు నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని ఆనకట్టలు, జలాశయాలు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, నదులు, చెరువులు, జలాశయాల వద్దకు వెళ్లరాదని, చిన్న వంతెనలు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ప్రయత్నించడం ప్రాణాపాయమని హెచ్చరించారు. చేపల వేట కోసం కూడా నీటి ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఆశ్రయం పొందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చెరువులు, కుంటలు, అలుగులు, ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న నీటి పరిస్థితిని పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రహదారులు దెబ్బతినడం, గుంతల్లో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు పోలీసు శాఖ ఇరవై నాలుగు గంటల పాటు అప్రమత్తంగా సేవలు అందిస్తోందని పేర్కొంటూ, ప్రజలు అధికారుల సూచనలను పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.



## చెన్నూరులో చేపల వర్షం

**చెన్నూరు, జూలై 30, ప్రభాతవార్త**

చెన్నూరు పట్టణంలో వింత సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని పుప్పాల హనుమాన్ వీధిలో భారీ వర్షాలకు ఆకాశం నుంచి చేపలు పడినట్లు స్థానికులు చెబుతున్నారు. కాలనీలోని రోడ్లపై, ఇళ్ల ముందు పడిన చేపలను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వర్షపు గొడుగులు, సంచులు, బకెట్లతో చేపలను పట్టుకునేందుకు ప్రజలు, పిల్లలు పోటీపడ్డారు. మరి కొంతమంది ఈ సంఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలో చెరువు ఉండడం వలన భారీ వర్షం పడడంతో చేపలు రోడ్లపైకి వచ్చాయని పేర్కొన్నారు.

## ఓటరు జాబితా, భూ భారతిపై కలెక్టర్ సమీక్ష

**మందమర్రి, జూలై 30, ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మందమర్రి మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి మున్సిపల్ కమిషనర్, మండల తహసీల్దార్ సతీష్ కుమార్‌తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, ఇంకా ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సేకరించేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై కాంగ్రెస్ ఫైర్

**అభివృద్ధిపై తప్పుడు ఆరోపణలు చేయొద్దని హెచ్చరిక**



**బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఘాటైన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతిరమేష్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టిపిసిసి మెంబర్ చిలుముల శంకర్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత దశాబ్ద కాలంలో బెల్లంపల్లిని అభివృద్ధి లేకుండా వెనక్కి నెట్టిన వ్యక్తి ఇప్పుడు నిరాధార ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 32 నెలల కాలంలోనే ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి రూ.556 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాదులో అధికారులతో, ముఖ్యమంత్రితో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. దుర్గం చిన్నయ్య తన పదవీకాలంలో చేసిన అభివృద్ధి ఏమిటో పత్రాలతో నిరూపించడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. అలాగే ఆయన పాలనలో చోటుచేసుకున్న పలు వివాదాస్పద ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రజలకు జరిగిన అన్యాయాలను మరవలేమని అన్నారు. దళితులకు న్యాయం చేయలేకపోయిన ఆయనకు నైతిక హక్కు లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశ అభివృద్ధికి పునాది వేసిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసిన పార్టీ అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అనే గౌరవాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. ఈ ప్రెస్ మీట్‌లో 34 వార్డులకు చెందిన కార్యకర్తలు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు నెలలో 3 నెలల సన్నబియ్యం పంపిణీ

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త**



జిల్లాలోని రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-2026 నెలలకు సంబంధించిన 3 నెలల సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్కడక్కడా సర్వర్ సంబంధిత సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ, ఈపాస్ ఇంజనీర్లు వాటిని వెంటనే పరిష్కరించి పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని, జిల్లాలో సన్నబియ్యం నిల్వలు తగినంతగా అందుబాటులో ఉన్నందున ప్రతి అర్హులైన రేషన్ కార్డుదారునికి సన్నబియ్యం తప్పనిసరిగా అందించడం జరుగుతుందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగుతుందని, రేషన్ కార్డుదారులు తొందరపడకుండా, తమకు అనుకూలమైన సమయంలో సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి సన్నబియ్యాన్ని తీసుకోవచ్చని తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని మండల స్థాయిలో సంబంధిత మండల తహసీల్దార్లు, జిల్లా స్థాయిలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిరంతరం పర్యవేక్షిస్తారని, జిల్లాలో ప్రస్తుతం 2 లక్షల 57 వేల 251 రేషన్ కార్డులు ఉన్నాయని, అర్హులైన ప్రతి కార్డుదారునికి 3 నెలల సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల డీలర్లు, రేషన్ కార్డుదారులు అక్రమంగా పక్కదారి మళ్లించి విక్రయించినట్లయితే తెలంగాణ ప్రజా పంపిణీ వ్యవస్థ (నియంత్రణ) ఆర్డర్-2016లోని సెక్షన్ 17(డి) ప్రకారం సంబంధిత రేషన్ డీలర్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయబడుతుందని, రేషన్ కార్డుదారులు రేషన్ బియ్యాన్ని విక్రయించినట్లయితే వారి రేషన్ కార్డు రద్దు చేయడంతో పాటు వారి మీద క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.

## విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త**

ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఫిన్లాండ్ విదేశీ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఎంపికై విజయవంతంగా పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలం అక్కపెల్లిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన జాజల శ్రీనివాస్, కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దాముక కమలాకర్ ఫిన్లాండ్ పర్యటనకు ఎంపికయ్యారని, వారి పాఠశాలలలో వరుసగా 450, 600 మంది విద్యార్థుల నమోదు ఉండటంతో రాష్ట్రంలో అత్యధిక విద్యార్థుల నమోదు కలిగిన పాఠశాలలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ఫిన్లాండ్ పర్యటనలో విద్యార్థి కేంద్రిత బోధన, సృజనాత్మక అభ్యాస పద్ధతులు, తరగతి గది నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారని, అక్కడి ఉత్తమ విద్యా విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మరింత మంది ఉపాధ్యాయులను విదేశీ ఎక్స్‌పోజర్ విజిట్‌లకు పంపడంతో పాటు ప్రభుత్వ వ్యయంతో విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.





## ఉప్పొంగిన ఒర్రె..
# 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

**కెరమెరి, జూలై 30 ప్రభాతవార్త:**

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సాంగ్వి-కేలి బీ గ్రామాల మధ్య ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద ఉధృతి కారణంగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలతో పాటు ఇందాపూర్, ఖైరి, గోండుగూడ తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా, బుధవారం రాత్రి సాంగ్వి గ్రామంలో ఓ ఇంటి గోడ కూలిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది గ్రామంలోని ఓ కాలనీలో వరద నీరు ఇండ్ల మధ్య చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంపీడీవో అంజత్ పాషా దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తహసీల్దార్ నాగార్జున, ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లలోకి నీరు చేరకుండా ఆయిల్ ఇంజిన్ ద్వారా వెంటనే నీటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం సాంగ్వి-కేలి బీ గ్రామాల మధ్య ఉప్పొంగి ప్రవహిస్తున్న ఒర్రెను పరిశీలించిన అధికారులు, వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున ప్రజలు నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

## 8వ వార్డు సమస్యలు పరిష్కరించండి

**- మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమీషనర్‌లకు వార్డు కౌన్సిలర్ వినతి**



**కాగజ్‌నగర్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :**

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకనగర్ వార్డు నెం.8కు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, కమిషనర్ తిరుపతి లకు వినతిపత్రం అందజేశారు. వార్డులో డ్రైనేజీలను వెంటనే శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. స్ట్రీట్‌లైట్లు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వెలుతురు సౌకర్యం కల్పించాలని, వీధి కుక్కల బెడదను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలోని ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులను వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

## వర్షాల వేళ ప్రజలకు అండగా కౌన్సిలర్ సూరజ్

**- 25వ వార్డులో పర్యటన.. బాధితులకు తక్షణ సాయం**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :**



భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని 25వ వార్డులో కౌన్సిలర్ దుర్గం సూరజ్ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పలు ఇళ్లలో పైకప్పుల నుంచి వర్షపు నీరు కారుతున్న విషయాన్ని గుర్తించి బాధిత కుటుంబాలకు వెంటనే సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో వార్డు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్షాల ప్రభావం తగ్గే వరకు వార్డులోనే అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# వర్ష బీభత్సంపై మంత్రి వివేక్ క్షేత్రస్థాయి పరిశీలన

**- కామాఖ్య ఆలయ మార్గం, కూలిన ఇండ్లను పరిశీలించిన మంత్రి**

**- మందమర్రిలో ప్రభావిత ప్రాంతాల పరిశీలన - బాధితులకు పరిహారం అందిస్తామని భరోసా**





**మందమర్రి, జూలై 30, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో వర్ష ప్రభావిత పలు ప్రాంతాలలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి గురువారం రోజు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మంచిర్యాల జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. గురువారం మందమర్రి మున్సిపల్ పరిధిలోని 19, 7వ వార్డుల్లో వర్షాల కారణంగా నెలకొన్న పరిస్థితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడే పరిస్థితిని అధిగమించేందుకు రహదారి అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అటవీశాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీశాఖ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందమర్రి 19వ వార్డులోని కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో నిలిచిన నీటి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. అలాగే 7వ వార్డులో వర్షాలకు కూలిన ఇంటి గోడను పరిశీలించారు. బాధిత ఇంటి యజమానులకు పరిహారం అందించి, ఇంటి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దెబ్బకు బెల్లంపల్లి అలర్ట్..

**- రంగంలోకి దిగిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి**

**బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం బెల్లంపల్లి పట్టణంపై తీవ్రంగా పడుతుండటంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వేళ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్వయంగా రంగంలోకి దిగారు. పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే. వర్షపు నీటిలోనే నడుచుకుంటూ ప్రజల వద్దకు చేరుకుని వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ప్రజల ఇబ్బందులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పరోక్షంగా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అధికారులకు కఠిన ఆదేశాలు చేశారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి అలసత్వం సహించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులను అక్కడికక్కడే అప్రమత్తం చేస్తూ డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలి, నీరు నిలిచిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి, రోడ్లపై నీటి నిల్వలు తొలగించాలి, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి. సమస్యలు వచ్చిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజలు కూడా నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ పర్యటనలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు

**జూన్ 1 నుంచి జులై 30 వరకు 450.5 మి.మీ నమోదు - పెంబి, కడెం పెద్దూర్‌లో అధికం కుబీర్, తానూర్, బాసర్‌లో లోటు**

**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షాలు సాధారణంగా కురుస్తున్నాయి. జూన్ 1 నుంచి జులై 30 వరకు జిల్లా సగటు వర్షపాతం 450.5 మి.మీగా నమోదైంది. సాధారణంగా ఈ కాలానికి 469.7 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ప్రస్తుతం 4.1 శాతం లోటుతో జిల్లా సాధారణ వర్గంలో కొనసాగుతోంది. గురువారం ఒక్కరోజే జిల్లావ్యాప్తంగా 54.3 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే పెంబి, కడెం పెద్దూర్ మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. పెంబిలో సాధారణం 486 మి.మీ ఉండగా 627.2 మి.మీ కురిసి 29 శాతం అధికంగా ఉంది. కడెం పెద్దూర్‌లో సాధారణం 499.7 మి.మీ ఉండగా 636.6 మి.మీ నమోదై 27 శాతం అధికంగా నమోదైంది. జులై 30న కడెం పెద్దూర్‌లో 122 మి.మీ, పెంబిలో 105 మి.మీ చొప్పున వర్షం పడింది. మరోవైపు కుబీర్, తానూర్, బాసర్ మండలాల్లో వర్షాలు తక్కువగా కురిశాయి. కుబీర్‌లో 32 శాతం, తానూర్‌లో 30 శాతం, బాసర్‌లో 25 శాతం లోటు నమోదైంది. నిర్మల్ అర్బన్, మామడ, దస్తూరాబాద్, భైంసా, కుంటాల సహా మిగిలిన 14 మండలాల్లో సాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయి. సోన్ మండలంలో సాధారణ వర్షపాతం 467.8 మి.మీతో సరిగ్గా నమోదైంది. జిల్లాలో ఎక్కువ భాగం సాధారణ వర్షాలు ఉండటంతో ఖరీఫ్ పంటలకు అనుకూలంగా ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. అయితే లోటు ఉన్న మూడు మండలాల్లో రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

# కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తోంది

- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ హామీ - జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం

- గనుల్లో రక్షణ చర్యలు, కార్మిక కాలనీల్లో మౌలిక వసతులపై సుదీర్ఘ చర్చ

- సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని జీఎం మునిగంటి శ్రీనివాస్ హామీ

**నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త**

కార్మికుల సంక్షేమానికి సింగరేణి సంస్థ అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఉద్యోగుల సౌకర్యార్థం అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) ప్రతినిధులతో జీఎం మునిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన స్ట్రక్చర్ కమిటీ సమావేశం జరిగింది. జూన్ నెల సమావేశంలో యాజమాన్యం దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యల వివరాలను ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు అందజేశారు. ఏరియా పరిధిలో పరిష్కరించదగిన సమస్యలను దాదాపు పూర్తి చేశామని, కార్పొరేట్ పరిధిలోని అంశాలను, ఇతర అనుమతులతో ముడిపడి ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని జీఎం హామీ ఇచ్చారు. అనంతరం జులై నెల స్ట్రక్చర్ కమిటీ అజెండాలో భాగంగా ఏరియాలోని వివిధ గనుల్లో ఉద్యోగుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను గుర్తింపు సంఘం నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం మునిగంటి శ్రీనివాస్, చిత్రంలో అధికారులు, యూనియన్ నాయకులు

గనులు, పని ప్రదేశాలలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనే లక్ష్యంగా అవసరమైన పనిముట్లు, యంత్రాల సమీకరణతో పాటు కార్మికుల కోసం రెస్ట్ హాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కార్మిక కాలనీల్లో కోతుల బెడద నివారణ, వీధిదీపాల ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పనపై వినతులు అందజేశారు. గుర్తింపు సంఘం ప్రతినిధులు లేవనెత్తిన అంశాలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని జీఎం మునిగంటి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. కార్మికులు, కార్మిక సంఘాలు సమన్వయంతో వ్యవహరిస్తూ రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించి సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఎస్ఓటు జీఎం కృష్ణప్రసాద్, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఎస్ఆర్‌పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్.కె గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎంలు రాజన్న, కృష్ణారెడ్డి, మల్లయ్య, ఆనంద్ కుమార్, డీవై సీఎంఓ రమేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, సీనియర్ పీఓ ప్రశాంత్, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒర్రెలపై వంతెనల నిర్మాణానికి కృషి చేస్తా..

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**బెజ్జూర్, జూలై 30, ప్రభాతవార్త:**

గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు బెజ్జూర్ మండలంలోని పలు ఆదివాసి గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కృష్ణపల్లి గ్రామ శివారులో గల ఒర్రె, సుస్మీర్ ఒర్రె నిండకుండలా ప్రవహిస్తున్నాయి. దీంతో ఒర్రెల అవతల ఉన్న ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రతి సంవత్సరం వచ్చే వర్షాకాలం ఇబ్బందులు ఇక మొదలయ్యాయని వారు ఆవేదన చెందుతున్నారు. వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణపల్లి ఒర్రెను గురువారం ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అనుమతులు రాక బెజ్జూర్ మండలంలోని కొన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం లేకుండా పోయిందని అన్నారు. వచ్చే నెలలో జరిగే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రిని సంప్రదించి అటవీశాఖ అనుమతులు సాధిస్తామని తెలిపారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు వెళ్లకూడదని అన్నారు. సహాయక చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని అవసరమైతే సహాయం కోసం వారిని సంప్రదించాలని కోరారు. వరద ఉధృతిని పరిశీలించిన వారిలో తహసిల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీఓ బిఎస్ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ నాగరాజు, సిఐ సంతోష్ కుమార్, ఎస్ఐ సర్తాజ్ పాషా, నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, సామల తిరుపతి, గడ్డం రాజేష్, ప్రవీణ్, రమేష్, వసీ ఉల్లాఖాన్, రాజారాం, రాకేష్ ఉన్నారు.



ఒర్రె ఉధృతిని పరిశీలిస్తున్న ఎంఎల్ఏ, అధికారులు



# వర్షాల వేళ అప్రమత్తం..!

- బారెగూడలో పారిశుద్ధ్యంపై సర్పంచ్ వేణుగోపాల్ సమీక్ష

- సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :**

భారీ వర్షాల నేపథ్యంలో బారెగూడ గ్రామ పంచాయతీ అప్రమత్తమైంది. గ్రామంలో పారిశుద్ధం, ప్రజారోగ్య పరిరక్షణ చర్యలపై గ్రామ పంచాయతీ సర్పంచ్ కోట వేణుగోపాల్ సిబ్బందితో అత్యవసర సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి గ్రామ పంచాయతీ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, గ్రామంలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, కాలువలను శుభ్రంగా ఉంచి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం జీఎన్ఎం, ఏఎన్ఎం సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి, డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణపై గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన జాగ్రత్తలను వివరించడంతో పాటు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యల్లో గ్రామ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేస్తున్న సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మార్వో నాగరాజు

## వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న లో లెవెల్ వంతెన

**లింగాపూర్, జూలై 30, ప్రభాతవార్త**

మండలంలోని మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల కేంద్రానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిట్ట గుడ గ్రామ సమీపంలో ఉన్న లో లెవెల్ వంతెన వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పిట్టే గూడ వాగు వద్ద ఎమ్మార్వో నాగరాజు. ఎంపీడీవో రామచందర్. ఆర్ ఐ ప్రదీప్. లింగాపూర్ ఎస్సై సురేష్. ప్రజలను వాగులోకి రానివ్వకుండా బారికేట్లు ఏర్పాటు, చేసి వరద పరిస్థితులను జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అత్యవసరమైతే తగు జాగ్రత్తలతో తప్ప ఇంటి నుంచి ఎవరు బయటకు వెళ్ళవదు వరద నీళ్లతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుందడంతో చేపల వేటకు ఎవరు కూడా వెళ్ళవద్దు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి, ఎవరు కూడా ఇంటి నుండి బయటకు వెళ్లరాదని అని తెలిపారు



## శాస్త్రీయ దృక్పథానికి పాఠశాలలే కేంద్రాలు

**ఆసిఫాబాద్ టౌన్, జూలై 30, ప్రభాతవార్త :**

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా స్వభావం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్స్పైర్ మనక్ 2026-27 లో జిల్లాలోని అన్ని పాఠశాలలు పాల్గొని 100 శాతం నామినేషన్లు పూర్తి చేయాలని, 32వ జాతీయ బాలల విజ్ఞాన సదస్సు 2026లో ప్రతి పాఠశాల కనీసం ఒక ప్రాజెక్టుతో పాల్గొనాలని సూచించారు. అలాగే ఖగఏక్ పెడ్ మా కే నామ్‌గగ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని, ఏకో క్లబ్ ఆన్లైన్ కాంపిటీషన్స్-2026లో ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, అకడమిక్ కోఆర్డినేటర్ మామిడాల తిరుపతయ్య, రిసోర్స్ పర్సన్ దుర్గాప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**తాండూర్, జూలై 30, ప్రభాతవార్త :**

సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో గురువారం సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల భూముల సమస్యలను పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. సమగ్ర భూ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలిక లాభాలు కలుగుతాయని, భూముల కొలతలు కచ్చితంగా నమోదు చేయడం వల్ల భవిష్యత్‌లో రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాట్ల నర్సయ్య, తహసిల్దార్ జ్యోత్స్న, గిర్దావర్ బొలిశెట్టి పద్మజ, సర్వేయర్ రామకృష్ణ, కార్యదర్శి సౌందర్య, రైతులు పాల్గొన్నారు.





## నిర్మల్‌లో ఓటరు జాబితా సవరణ 100శాతం పూర్తి

### - కాంగ్రెస్ బీఎల్‌ఏల కృషిని అభినందించిన ఆరేపల్లి మోహన్

**నిర్మల్, జులై 30, ప్రభాతవార్త:**

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో నిర్మల్ జిల్లా 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిందని ఆదిలాబాద్ పార్లమెంటరీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ ఆరేపల్లి మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలను ఆయన అభినందించారు. బుధవారం నిర్మల్ పట్టణంలో నిర్మల్ నియోజకవర్గ బీఎల్ఏ పరిశీలకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ ఆరేపల్లి మోహన్, నిర్మల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తహర్ బిన్ హమ్దాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, ఏవైనా తప్పులు దొర్లి ఉంటే సరిదిద్దుకునేందుకు మరో రెండు రోజులు గడువు ఉందన్నారు. ఆగస్టు 12, 13 తేదీల్లో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలవుతుందని, అన్యాయంగా తొలగిపోయిన ఓట్లను తిరిగి నమోదు చేసుకునేలా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.బి. రాజేశ్వర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందన్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీహరి రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, పార్టీ మండల అధ్యక్షులు, బీఎల్ఏ పరిశీలకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రత్యేక సమావేశం

**భైంసా, జులై 30, ప్రభాతవార్త:**

భైంసా మండల కేంద్రంలోని దేగాంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఇన్‌చార్జులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, రామ్‌రెడ్డి, డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, భైంసా పట్టణ కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందనే విషయాలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు కష్టపడి పనిచేసి అర్హులైన ఓటర్ల పేర్లు డిలీట్ కాకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పాటిల్, వైస్ చైర్మన్ ఎండి ఫారూక్ అహ్మద్, మండల పార్టీ అధ్యక్షులు ముత్తా గౌడ్, గజానన్ పటేల్, మైపాల్ రెడ్డి, సాపేవారు కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ సూర్యం రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, న్యాయవాది ప్రసంగిత ఆగ్రే, కాంగ్రెస్ నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.



# కాసిపేట-2 గనిపై ఘనంగా మెగా ప్లాంటేషన్

### - 2వేల మొక్కలు నాటిన డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, జి.ఎం రాధాకృష్ణ - భవిష్యత్తుకి పచ్చని బాట

**బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త**



బొగ్గు గనుల మధ్య పచ్చదనం పరిమళించింది. సింగరేణి మందమర్రి ఏరియా మరోసారి పర్యావరణానికి తన అంకితభావాన్ని చాటింది. కాసిపేట 2 గని ప్రాంగణం గురువారం పచ్చని వేదికగా మారి మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి సాక్ష్యమిచ్చింది. ఒకే రోజులో 2 వేల మొక్కలు నాటుతూ సింగరేణి ఉద్యోగులు, అధికారులు పర్యావరణ పరిరక్షణకు గట్టి సందేశం ఇచ్చారు. మంచిర్యాల జిల్లా అటవీ శాఖాధికారి రాహుల్ కిషన్ జాదవ్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఎఫ్‌డీఓలు, ఎఫ్‌ఆర్ఓలు, గని అధికారులు, కార్మికులు ప్రత్యేకంగా మహిళా కార్మికులు పాల్గొని మొక్కలు నాటడంలో ఉత్సాహంగా ముందుకు రావడం విశేషం. ఈ సందర్భంగా డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ ఒక మొక్కను నాటడం అంటే ఒక ప్రాణాన్ని నిలబెట్టడమే. పచ్చదనం లేకపోతే భవిష్యత్తే లేదు అంటూ పర్యావరణ పరిరక్షణపై ప్రాముఖ్యతను వివరించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు ప్రకృతి సంరక్షణకు సింగరేణి తీసుకుంటున్న చర్యలు ఆదర్శప్రాయమని అభినందించారు. జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ వర్షపు అనుకూల పరిస్థితుల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది మొత్తం 38 హెక్టార్లలో కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ తో పాటు ఖాళీ భూముల్లో కలిపి ఒక లక్ష 80 వేల మొక్కలు నాటే లక్ష్యం పెట్టుకున్నామని వెల్లడించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా 19 ఓపెన్‌కాస్ట్ గనుల్లో పర్యావరణ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాసిపేట2 గని మాత్రమే కాకుండా, మొత్తం సింగరేణి పరిధిలో పచ్చదనం విస్తరించే దిశగా ఈ కార్యక్రమాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేకేఓసీపీ పరిధిలోని సిప భూములను డిఎఫ్ఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, యూనియన్ ప్రతినిధులు, గని కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ వంద శాతం పూర్తి చేసిన బీఎల్‌ఏలకు సన్మానం

**భైంసా, జులై 30, ప్రభాతవార్త:**

భైంసాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ ఆరేపల్లి మోహన్, నిర్మల్ జిల్లా ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ తాహెర్ బిన్ హమ్దాన్ కాంగ్రెస్ పార్టీ సూపర్ వైజర్లు, బీఎల్‌ఏలతో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసిన బీఎల్‌ఏలను ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మిగిలి ఉన్న నాలుగు రోజుల్లో ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నవారు, చదువు, ఉద్యోగాలు, విదేశాల్లో ఉన్నవారి ఓటర్ల వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రక్రియను వీలైనంత త్వరగా వంద శాతం పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్ర, భైంసా టౌన్ ప్రెసిడెంట్ కె. అరవింద్, ఆత్మ డైరెక్టర్ చిన్నస్వామి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడను ఢీకొని యువకుడి మృతి

**మంచిర్యాల, జూలై 30, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలోని హమాలివాడలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. అదుపుతప్పిన ద్విచక్రవాహనం ఉర్దూ మాధ్యమ పాఠశాల ప్రహరీ గోడను ఢీకొని కాలువలో పడిపోవడంతో నిమ్మల విజయ్ కుమార్ (39) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, విజయ్ కుమార్ కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా హమాలివాడ మూలమలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి భార్య నిమ్మల కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ ఘటనతో హమాలివాడలో విషాద వాతావరణం నెలకొంది.

## పాము కాటుకు గురికాలేదు.. ముందస్తు జాగ్రత్తగానే ఆసుపత్రికి తరలించాం

### - పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కూర్మ రాజేందర్

**నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త**

సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు యశ్వంత్, రెహాన్ పాముకాటుకు గురికాలేదని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే వారిని ఆసుపత్రికి తరలించామని ప్రిన్సిపల్ కూర్మ రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెస్‌కు వెళ్తుండగా సమీపం నుంచి పాము వెళ్లడంతో భయాందోళనకు గురైన విద్యార్థులను మంచిర్యాల, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించగా పాముకాటు వేయలేదని వైద్యులు నిర్ధారించారన్నారు. విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యం అందించిన యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అనాథ పిల్లల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం సిద్ధం

**బెజ్జూర్,జూలై 30,ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండలంలోని రేచీని గ్రామానికి చెందిన అదే భీమ్రావు,తిరుపతమ్మ దంపతులు ఇరువురు మృతి చెందడంతో వారి పిల్లలు ముగ్గురు అనాథలు అయ్యారు.ఇట్టి విషయం తెలుసుకున్న డిసిపిఓ బూర్ల మహేష్,చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్ వారిని కలిసి పిల్లల పరిస్థితిని తెలుసుకున్నారు.పిల్లల సంరక్షణ,విద్య, ఆరోగ్యం,నివాస పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి సంరక్షకులు మరియు అంగన్వాడి టీచర్ తో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు.అనంతరం తక్షణ సహాయంగా డీసీపీయూ ఆధ్వర్యంలో కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు.అనాథ పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు.వారి విద్య,పోషణ,రక్షణ ఆరోగ్య సేవలు,పునరావాసం మరియు సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.పాఠశాల మానేసిన బాలికను తిరిగి పాఠశాలలో చేర్పి,మిగతా పిల్లల చదువుకు ఎలాంటి అవంతరాలు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మిషన్ వాత్సల్య స్పాన్సర్షిప్ పథకం కింద ఇద్దరు చిన్నారులకు ప్రతినెల 4 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరు అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి బూర్ల మహేష్ తెలిపారు.



# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి డిజిపి సి.వి.ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 24 7 పని చేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి పూర్తి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు






అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, ఖఁజీరో క్యాజువాలిటీస్ఁఁ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

రాష్ట్ర డి.జి.పి. మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాల సభ్యులను సమన్వయం చేసుకొని ప్రజా రక్షణ చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలోని వాగులు, నదులు, కల్వర్టుల వద్ద బందోబస్తు చర్యలు చేపట్టి ప్రజలు అటువైపుగా వెళ్లకుండా నిఘా నిర్వహిస్తున్నామని, లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థ భవనాల ప్రజలను ముందస్తు చర్యలలో భాగంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఎ.భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ష బీభత్సం.. వరుసగా కూలుతున్న ఇళ్లు!

## కూలీ కుటుంబాలకు నిలువ నీడ కరువు... - శిథిలావస్థలో ఇళ్లతో ప్రాణభయం.. - తక్షణ సాయం కోసం బాధితుల వేడుకోలు

**మందమర్రి, జూలై30, ప్రభాతవార్త**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మందమర్రి పట్టణాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లు వరుసగా కూలిపోతుండటంతో నిరుపేద, కూలీ కుటుంబాలు నిలువ నీడ కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు కళ్లముందే కూలిపోవడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.



### పలు ప్రాంతాల్లో కూలిన ఇళ్లు

పట్టణంలోని ఒకటో జోన్ పోస్ట్ ఆఫీస్ ఏరియాలో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ముల్కల లక్ష్మీనారాయణ నివాసం వర్షాలకు దెబ్బతిని కూలిపోయింది. అలాగే గ్యాస్ గోదాం లైన్‌లో ప్రసాద్కు చెందిన ఇల్లు కూడా కూలిపోయింది. మార్కెట్ ఏరియా చిరు నగర్, కొత్తగట్టు ప్రాంతంలో రాజేందర్ ఇల్లు కూలిపోవడంతో కుటుంబం నివాసం లేకుండా పోయింది. అదేవిధంగా వెంకటేశ్వర టెంపుల్ ఏరియాలో ఆయిల్లా కనకలక్ష్మి ఇల్లు కూడా భారీ వర్షాలకు కూలిపోయింది.

### నిలువ నీడ లేక.. సాయం కోసం ఎదురుచూపులు

భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులు తలదాచుకోవడానికి ప్రభుత్వం, అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని కోరుతున్నారు. ఇళ్లు కూలిపోయి ఆస్తి నష్టంతో పాటు నివాసం కోల్పోయామని, తమను ఆదుకునేందుకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. ఖఁఇల్లు కూలిపోయింది.. తలదాచుకోవడానికి దారి చూపండిఁఁ అంటూ బాధితులు అధికారులను వేడుకుంటున్నారు. నిరుపేద కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు సురక్షిత ప్రాంతాల్లో తాత్కాలిక వసతి కల్పించాలని కోరుతున్నారు.

### పాత ఇళ్లపై అధికారుల హెచ్చరిక

పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ నివసించవద్దని అధికారులు ప్రజలకు సూచించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పాత, బలహీనంగా ఉన్న ఇళ్లలో ఉంటే ప్రాణహాని జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎస్సై నరేష్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

### తక్షణ సాయం అందించాలని డిమాండ్

వర్షాలు మరికొంత కాలం కొనసాగితే మరిన్ని పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రమాదకర ఇళ్లను గుర్తించి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.









# బెల్లంపల్లి రాంనగర్ బ్రిడ్జిపై వరద ఉధృతి

## - ప్రజలకు హెచ్చరికలు జారీ

**బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణాన్ని వరద ముప్పు గట్టిగా పట్టిపీడిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 27, 33, 34వ వార్డులను కలిపే కీలకమైన రాంనగర్ బ్రిడ్జి పై వరద నీరు ఉధృతంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రస్తుతం అక్కడి పరిస్థితి అత్యంత భయానకంగా మారింది. ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గమైన ఈ బ్రిడ్జి పూర్తిగా ప్రమాదకరంగా మారినప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా దాటేందుకు ప్రయత్నించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమై కఠిన చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతిరమేష్ బాబు స్వయంగా రంగంలోకి దిగి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్పష్టం చేశారు. ప్రాణాల మీదకు తెచ్చుకునేలా ఎవరూ బ్రిడ్జిని దాటే ప్రయత్నం చేయకూడదు. నీటి ప్రవాహం తీవ్రంగా ఉండటంతో ఒక్క తప్పు అడుగు ప్రాణనష్టం కలిగించే ప్రమాదం ఉంది అని గట్టిగా హెచ్చరించారు. ఇప్పటికే బ్రిడ్జి ఇరువైపులా భారీగా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు నిలిపారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది 24 గంటలు అక్కడ మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అయినప్పటికీ కొంతమంది నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య తలెత్తుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. రాంనగర్ బ్రిడ్జి సమస్యకు వెంటనే దీర్ఘకాలిక పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిశీలనలో సంబంధిత వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి జాతికుంట చెరువులో ఉధృత పరిస్థితి

## - ముందస్తు చర్యలతో తప్పిన ప్రమాదం

**బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త**

భారీ వర్షాల కారణంగా బెల్లంపల్లి జాతికుంట చెరువు ఉప్పొంగి పరిసర ప్రాంతాలకు ముప్పు తలెత్తిన నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు రడగంబాల బస్తీలోని జాతికుంట చెరువును మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వార్డ్ కౌన్సిలర్ కంకటి ప్రణిత శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా చెరువులో వరద నీరు అధికంగా చేరి పూడికతో మూసుకుపోవడంతో నీటి ప్రవాహం అడ్డంకి ఏర్పడి, సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరే ప్రమాదం నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన మున్సిపల్ సిబ్బంది చెరువుకు మరొక వైపు గండి కొట్టి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు మాట్లాడుతూ చెరువు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంకటి శ్రీనివాస్, రూరల్ సీఐ హనోక్, 2 టౌన్ ఎస్ఐ తిరుపతి, బస్తీ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా ప్రజల ఆరోగ్యం మా ప్రాధాన్యం

**- 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ ప్రారంభం**

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 30, ప్రభాతవార్త

జిల్లాలో ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర వైద్య సేవల కోసం 24 గంటల కమాండ్ కంట్రోల్ రూమ్ మరియు హెల్ప్‌లైన్ నంబర్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు, ముఖ్యంగా వ్యాధులు వ్యాపించే సమయంలో, ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రజా ఆరోగ్యం – మా బాధ్యత అనే నినాదంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు విశ్వేశ్వర్ రెడ్డి, ఎపిడెమియాలజిస్ట్ సుమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ఓ కాకినాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే వైద్య సిబ్బంది నీలిమ, సురేందర్, రవి కిరణ్, రాజేష్, వసుమతి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బెల్లంపల్లి రాంనగర్ బ్రిడ్జి శంకుస్థాపనకే పరిమితమా..?

బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. హనుమాన్ బస్తీ, రాంనగర్, అశోక్ నగర్, కాల్టెక్స్ బజారు ప్రాంతాల ప్రజలు ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో ప్రారంభమవుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు ఇప్పటికీ నిరాశే మిగిలింది. గత సంవత్సరం సుమారు రూ., 2 కోట్ల నిధులు మంజూరు చేశామని ఘనంగా ప్రకటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన పేరుతో కొబ్బరికాయలు కొట్టి వెళ్లిపోయారే తప్ప పనులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. శంకుస్థాపన కార్యక్రమం తరువాత ఒక్క ఇటుక కూడా కదలకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

### ప్రజల మాటల్లో ప్రశ్నలు మండిపడుతున్నాయి...

నిధులు మంజూరు అయినా పనులు ఎందుకు మొదలుకాలేదు? కాంట్రాక్టర్ లభించలేదా? లేక ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారా? ప్రాజెక్ట్ ఎక్కడ నిలిచిపోయింది? బాధ్యులు ఎవరు? ప్రజల సమస్యలు అధికారులకు కనిపించడం లేదా? ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి దాటడం ప్రమాదకరంగా మారి చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా సులభంగా రాకపోవడం ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. బెల్లంపల్లి ప్రజల ప్రాణాలకు విలువ లేదా? అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రకటనలు చేసుకునే నాయకులు, నేలమీద పని చేయడంలో విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాంనగర్ బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించాలని, వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమని ప్రజలు హెచ్చరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## సింగరేణి ఇంజనీరింగ్ విభాగంలో ఏజీఎం రమణారావు సేవలు మరువలేనివి

**- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**- మొక్క నాటి జ్ఞాపకాలను పంచుకున్న అధికారులు**

నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త



సింగరేణి సంస్థలో ఏజీఎం (ఈ అండ్ ఎం) టీ. రమణరావు అందించిన సేవలు మరువలేనివి. అందులోనూ శ్రీరాంపూర్ ఇంజనీరింగ్ విభాగంలో ఆయనకు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. జులై మాసంతో పదవీ విరమణ పొందనున్న శ్రీరాంపూర్ ఏరియా ఏజీఎం (ఈ అండ్ ఎం) టీ. రమణరావుకు గురువారం ఏరియా వర్క్‌షాప్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, శాలువాతో రమణరావును ఘనంగా సత్కరించారు. అనంతరం వర్క్‌షాప్ అధికారులు, సిబ్బంది ఆయనను పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ టీ. రమణరావు ఎంతో మృదుస్వభావి, మితభాషి అని, పని విషయంలో మాత్రం నిబద్ధత, నిజాయితీలతో వ్యవహరించేవారని తెలిపారు. తన బాధ్యతలను పకడ్బందీగా నిర్వర్తిస్తూనే, తన కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు సైతం విధులు సక్రమంగా నిర్వహించేలా నిక్కచ్చిగా నడిపించేవారని పేర్కొన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఏరియా వర్క్‌షాప్ ప్రాంగణంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, పదవీ విరమణ పొందుతున్న ఏజీఎం రమణరావుతో కలిసి జీఎం మునిగంటి శ్రీనివాస్ మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, డీజీఎంలు సురేష్, కృష్ణారెడ్డి, హరినారాయణ, సంక్షేమ అధికారి రమేష్ నాయక్, ఇతర అధికారులు, ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు గడువు పొడిగింపు

బెల్లంపల్లి, జూలై 30, ప్రభాతవార్త

ముసురు వర్షాల ఉధృతి నేపథ్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ముందుగా జూలై 29 వరకు గడువు ఉండగా, అభ్యర్థులకు మరింత అవకాశం కల్పించేందుకు రెండు రోజులపాటు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. 2026–27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ బి.ఎ. ఆనర్స్ (పొలిటికల్ సైన్స్ – ఇంగ్లీష్ మీడియం) మరియు పీజీ ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ (ఇంగ్లీష్ మీడియం) తరగతులకు బోధించడానికి ఇంగ్లీష్ మీడియం బ్యాక్‌గ్రౌండ్ కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులు (ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం) సాధించిన వారు అర్హులు కాగా, పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి ఉన్నత అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని తెలిపారు. అలాగే అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, డెమో తరగతులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఐడి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూ తేదీలను ఐడి కళాశాల ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు అభ్యర్థులకు ప్రత్యేకంగా తెలియజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 9959269975 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



## ప్రమాద ప్రాంతాలలో ప్రజల రాకపోకలను నియంత్రించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**

నస్పూర్, జూలై 30, ప్రభాతవార్త

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదులు, కల్వర్టులు ఇతర ప్రమాద ప్రాంతాల వద్దకు ప్రజలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు ప్రవాహాన్ని, శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితుల దృష్ట్యా ప్రజా సంక్షేమ, రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాగు ఉధృతి పెరిగిన సందర్భంలో ప్రజలు ఎత్తి పరిస్థితులలోనూ వాగును దాటకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాగ్రత్త చర్యలలో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాగు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల భవనం ప్రస్తుత స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల భవనం పరిస్థితిపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అత్యవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.